
# “లోకమందలి మంచిచెడ్డలు లోకు లెరుగుదురా?”

**దేశం ముందుకు వెళ్ళాలంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నాడు ఒక యువకుడు. మరో యువకుడు వ్యావసాయికంగా అభివృద్ధి చెందాలన్నాడు. ఆ యిద్దరిమధ్య వాదోపవాదాలు ఆరంభమైనాయి. వాళ్ళ మాటలు వింటూ ఊరికే కూర్చోలేకపోయాడు వెంకటసుబ్బయ్య.**

మన దేశం వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల దేశం కాబట్టి, వ్యావసాయికంగానే అభివృద్ధి చెందాలని వాదించాడు. అంతే, ఆ యువకుల చర్చ ఆజ్యం పోసిన అగ్నిలా తీవ్రరూపం దాల్చింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్న యువకుడు వెంకటసుబ్బయ్యను ఉద్దేశిస్తూ ఒక చిన్న ఉపన్యాసం చేశాడు, హావభావాలు ప్రకటిస్తూ.




“ఏముందండీ వ్యవసాయంలో. రైతులేదో బంగారం మూటగట్టుకుంటున్నారనీ, మేడలూ, మిద్దెలూ కట్టుకుంటున్నారనీ పట్టణాల్లో, ఆఫీసుల్లో ఫ్యాన్ల కింద కూర్చుని కాలక్షేపం చేసేవారు అనుకుంటారు. కాని రైతులు పడుతున్న బాధల్ని ఎవరైనా చూశారా? పోనీ అసలందుకు ప్రయత్నించారా? ఎంత సేపటికీ రైతు లాభం గడిస్తున్నాడనే అపోహతోనే వుంది లోకం. వ్యవసాయపు పనిముట్ల ధరలు ఎక్కువైనాయి. వ్యవసాయం ఖర్చులా రోజురోజుకి పాపంలా పెరిగిపోతున్నాయి.

ఇప్పుడు మీరే సొంత వ్యవసాయం పెడతారనుకోండి. ఒక జత యెడ్లు కొనాలి. నాగలి వగైరాలు సంపాదించుకోవాలి. ఒక పాలేరునైనా పెట్టుకోవాలి. ఇక శిస్తుల సంగతా చెప్పనవసరం లేదు. ఇన్ని ఖర్చులూ భరించి, దైవం చల్లని చూపుచూస్తే- అప్పుడుగదా రైతు ఇంటికి ధాన్యం చేరేది! అప్పులవాళ్ళ బాధ పడలేక కళ్ళంలోని ధాన్యాన్ని కళ్ళంలోనే బేరానికి పెట్టే దురదృష్టవంతుల్ని మనం చూస్తూనే వున్నాం. ఖర్చులన్నీపోను రైతుకు నిజంగా ఎంత మిగులుతోందని? రైతు ఎప్పుడూ మట్టి పిసుక్కుంటూ కూర్చోవలసిందేనా? అతనికీ వినోదాలు కావాలి, విజ్ఞానం కావాలి. అతని సంతానానికి చదువులు కావాలి మరి వీటన్నిటికీ సరిపడే ఆదాయం రైతుకి లభిస్తోందా? ఇవన్నీ చూడరు. వడ్లబస్తా ధర పెరిగింది. భూమివిలువ పెరిగింది- అంటారేకాని రైతు అవసరాలేమిటో ఆలోచించారా!

పట్టణంలో యివాళ ఒకడు అయిదారు వందల రూపాయల పెట్టుబడితో ఒక చిన్న తమలపాకుల బడ్డీగాని లేకపోతే టీ దుకాణమో పెడతాడనుకుందాం. అయిదారేళ్ళు తిరిగేసరికల్లా అదొక చిన్న ఫాన్సీ షాపుగా తయారవుతుంది. లేదా ఒక చిన్న హోటలుగా రూపం దాలుస్తుంది. కొంతకాల మయ్యేసరికి అతనో వ్యాపారస్తుడుగా తయారవుతాడు. ఇల్లూ, వాకిలీ యేర్పరుచుకుంటాడు. సంఘంలో స్థానం సంపాదిస్తాడు. అటువంటి వాళ్ళంటే ఈర్ష్యతో నేననడంలేదు పట్టణాల్లోవుండే చిన్న వ్యాపారస్తులూ బాగుపడాలి. అదే సమయంలో తరతరాలుగా కేవలం భూమినే నమ్ముకుని కాలంగడిపే రైతుకూడా బాగుపడాలని యితరులు అనుకోవాలి. అంటే రైతులెవరూ బాగుపడలేదని నేననడం లేదు. ధనవంతులెప్పుడూ బాగుపడతారు. కాని ఋణభారంతో, దారిద్ర్యంతో కుంగిపోతున్న రైతులే చాలామంది కనిపిస్తారు గ్రామాలలో. అందుకనే పల్లెటూళ్ళలో ఈనాటికీ పూరిపాకలూ, పడిపోతున్న యిళ్ళూ కనిపిస్తాయి. తమ పిల్లలకి పెద్ద చదువులు చెప్పించుకోలేని పేదరైతులూ, ఆధునిక విజ్ఞానాన్ని తమదిగా చేసుకోలేని దురదృష్టవంతులూ యెందరో కనిపిస్తారు మనకు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ వ్యవసాయంమీదే ఆధారపడడంకంటె సన్నకారు రైతులు చిన్న చిన్న పరిశ్రమల్లోకూడా నిమగ్నులు కావడం మంచిది. అప్పుడే దేశం నిజంగా అభివృద్ధి చెందుతుంది.

ఈ సంగతి నేనేమీ కొత్తగా చెప్పడం లేదు. తీరిక వేళల్లో సన్నకారు రైతులు ఏదైనా ఒక వృత్తి అవలంబించాలి. ఒక్క వ్యవసాయం మీదనే ఆధారపడి వుండాలంటే వాళ్ళకి భూమి ఎంత వుంటుందని? మహావుంటే రెండు మూడెక



లు వుండవచ్చు. అసలు ఏమీ లేకుండా తరుల భూమిని కౌలుకి తీసుకుని వ్యవసాయం చేసేవారూ చాలామంది వున్నారు. అందుకనే దేశం పారిశ్రామికంగా ముందుకు వెడితేనే దేశమంతా బాగుపడుతుంది. సన్నకారు రైతుల స్థితిగతులు మెరుగవుతాయి."

ఆ యువకునినరనరాలలో ఏదో బాధా. ఆవేశం నెలకొన్నాయి. ముఖం ఎర్రబడింది. చేతిలోని పత్రిక కాస్తా నలిగిపోయింది.

వెంకటసుబ్బయ్య హతాశుడయ్యా

ఆయన స్వాభిమానం దెబ్బతిన్నది. ఆ యువకుడు చెప్పిన మాటలు అబద్ధం కాదనుకున్నాడు. తన బాల్యంలోనూ, ఆ తర్వాత తాను చూసిన తన ఊరిలో మార్పులేమీ కనిపించలేదు రెండు మూడు మేడలు కొత్తగా వెలిసివుండవచ్చుగాని.




అప్పటి గుడిసెలు నేటికీ అలాగేఉన్నాయి మట్టిరోడ్డేగాని మంచిరోడ్డు ఇంకా ఏర్పడలేదు. కొన్ని గ్రామాలలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడ్డాయి. కాని చాలా గ్రామాలు మునపటిలాగే ఉన్నాయి.... పట్టణాలు!.... రోజు రోజుకి మారిపోతున్నాయి. కుక్కగొడుగులులా కొత్త పేటలు అవతరిస్తున్నాయి. పట్టణాలలో జనాభా అంతకంతకూ ఎక్కువవుతోంది- అనుకున్నాడు వెంకటసుబ్బయ్య. ఉక్కిరిబిక్కిరయాడు తాను గుప్తంగా దాచుకున్న చిరకాల వాంఛ. పల్లెటూరిని గురించి కన్న తీయని కలలు, తాను సాధిద్దామనుకున్న పనులు-ఇవన్నీ ఒక్కసారిగా గుర్తుకు వచ్చేసరికి భయంతో వణికిపోయాడు.

సాధారణంగా మానవుడు ఆశాజీవి కాని ఆ ఆశాసౌధాలూ, ఆ తీయనికలలూ కనుక చెరిగిపోతే అప్పుడతని జీవితం దుర్భరంగా తయారవుతుంది. అతని జీవితాని కొక లక్ష్యమంటూ ఏదీ కనిపించదు. అంతా అయోమయంగా, అర్ధరహితంగా కనిపిస్తుంది. అటువంటి అవస్థలో పడ్డాడు వెంకటసుబ్బయ్య.

అప్పటికే కొంచెం పొద్దుపోయింది. అందరూ లేచారు. ఎవరి యిళ్ళకు వాళ్ళు బయలుదేరారు.

ఆరాత్రి అన్నంముందు కూర్చున్నాడే కాని, వెంకటసుబ్బయ్య మనస్సు దేన్ని గురించో ఆలోచిస్తోంది. అన్నం రుచించలేదు. ఆ రాత్రి ఎన్నోకలలు. అన్నీ పీడకలలే. ఆయన్ని కలవరపెటిన విషయం: సొంత వ్యవసాయం పెట్టడమా, పెటకపోవడమా? మునపటిలా పొలం కౌలుకి ఇవ్వదలుచుకోలేదు. చేస్తే సొంత వ్యవసాయం చెయ్యాలి. లేకుంటే పొలం అమ్మివేసి పట్టణం చేరుకోవాలి.

రాములువంటి వాళ్ళుకూడా సన్నకారు రైతులకు సొంత వ్యవసాయం అంత లాభసాటి కాదన్నట్టుగా చెపుతున్నారు. వాళ్ళ మాటలు అబద్ధం కావని అభిప్రాయపడ్డాడు వెంకటసుబ్బయ్య. అందువల్ల పొలం అమ్మివేసి పట్టణంలో స్థిర నివాసం యేర్పరుచుకోవడమే మంచి దనుకున్నాడు. అలాచేస్తే తన యిదరు కొడుకులూ సంతోషిస్తారు. ముసలితనంలో అనవసరంగా కన్న కుమారులను దూరం కావడం భావ్యం కాదనీ. వాళ్ళ యిష్ట ప్రకారమే సంచరించడం మంచిదని అనుకున్నాడు.

కాని పొలం అమ్మడం మాత్రం యిష్టంలేదు వెంకట సుబ్బయ్యకు. పైగా

పొలం అమ్మివేసిన తర్వాత తనకూ, తన గ్రామానికీ సంబంధం యేముంటుంది? పొలం వుండడం వల్లనె అప్పుడప్పుడూ స్వగ్రామాన్ని సందర్శించే అవకాశమైనా కలుగుతోంది. పరిస్థితుల ప్రభావానికి తల వొగ్గి, తరతరాలుగా వస్తున్న అనుబంధాన్ని ఒక్కసారిగా విచ్ఛిన్నం చేయడమా? తన గ్రామాన్ని— అంటే తన పూర్వులు నిర్మించిన గ్రామాన్ని— తన పూర్వులు పుట్టి పెరిగి మట్టిలో మట్టిగా కలిసిపోయిన తన గ్రామాన్ని విడిచిపెట్టడమా? పోనీ భూమిని ఎప్పటిలా కౌలుకి యిస్తే? భూలక్ష్మిని సేవించాలనే నా చిరకాలవాంఛ, నా జీవిత లక్ష్యం చివరికి నెరవేరకుండా పోవలసిందేనా? అని ప్రశ్నించుకున్నాడు వెంకట సుబ్బయ్య రకరకాల భావాల మధ్య ఆయన మనస్సు నలిగి నలేరయింది.

ఎంతసేపు ఆలోచించినా సమస్య సమస్యగానె వుండిపోయింది. ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. రాములుతో సహా ఆత్మీయులనదగిన ముగ్గురు నలుగురితో సంప్రతించాడు. వాళ్ళంతా కూడబలుక్కుని చెప్పినట్టుగా ఒకే సలహా చెప్పారు.

"ముసలితనంలో మీరెందుకు శ్రమపడతారు? పొలాన్నే నమ్ముకున్నవాళ్ళకంటారా, ఎలాగూ తిప్పలు తప్పవు."

వెంకటసుబ్బయ్యని నిస్పృహా, నిరాశా ఆవహించాయి.

## 4

ఆ మరునాటి ఉదయం వెంకట సుబ్బయ్య రాముల ఇంటికివెళ్ళాడు. అతని భార్యనూ, పిల్లల్నీ చూసి వద్దామనే ఉద్దేశంతో. గుమ్మంలో అడుగు పెట్టాడో, లేదో లోపల్నుంచి బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి. లోపలికివెళ్ళడం భావ్యం కాదనుకున్నాడు. గుమ్మందగ్గరే నిలబడ్డాడు.

లోపల్నుంచి రాములు దంపతుల



ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు.
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2×2 రూబియాలున్ను
★స్కూలు యూనిఫారంలు ...వస్త్రాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట విజయవాడ-2.

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దినపత్రికనే చదవండి

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ పవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావ్స్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700. 1010

మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. వాగ్యుద్ధం జరుగుతోంది.

"ఛీ, ఛీ.... ఎందుకీ బురద కొంపలో మట్టి పిసుక్కుంటూ కూచోడం? శుభ్రంగా పట్నానికి వెళ్ళి ఏ ఫ్యాక్టరీలో అయినా కూలీగా చేరినా నాలుగు డబ్బులు కళ్ళ చూడచ్చు...."

"నోరు మూస్తావా, లేదా?"

"మా అన్నయ్యను చూసి...."

"నిన్నే, నోరు మూస్తావా, లేదా?"

"ఏమిటండీ మీ అధికారం మీరూను. ఇక్కడికి వచ్చింతర్వాత ఒక్క సినిమా కన్నా తీసికెళ్ళారూ...."

"అయితే పో, మీ అన్నయ్య దగ్గిరికి. అక్కడ నీ యిష్ట మొచ్చినట్లు రోజుకో సినిమా చూద్దువుగాని."

"చూసేదాన్నే.... కాని...."

"ఊఁ కాని...."

"ఆ మాయదారి దేముడు తీసుకొచ్చి నన్నీ బురదకొంపలో పడేశాడు. అంతా నా ఖర్మ."

"నీ ఖర్మ కాదు.... యిదంతా నేను చేసుకున్న పాపం.... తెలిసీ అడుసులోకి దిగాను"

వెంకటసుబ్బయ్య రాములు మాటలు వినలేకపోయాడు. అక్కడ నిలబడి వాళ్ళ మాటలు వినడం సభ్యత కాదనుకుని తిరుగుముఖం పట్టాడు.

వెంకట సుబ్బయ్య ముందుకు రెండు మూడడుగులు వేశాడో, లేదో వెనకనుంచి 'బాబుగారూ' అంటూ రాములు పిలుపు వినిపించింది. రండి రండి— అంటూ ఆయన్ని సమీపించాడు.

రాములుతోపాటు లోపలికి వెళ్ళాడు వెంకట సుబ్బయ్య అడుగులో అడుగు వేసుకుంటూ.

"రండి, బాబుగారూ రండి" రాములు భార్య ఆప్యాయంగా పలకరించింది.

వెంకటసుబ్బయ్య కొంచెం నిర్ఘాంత పోయాడు. అంత ఆప్యాయంగా ఆమె పలకరిస్తుందని ఆయన అనుకోలేదు.

"ఈయనే మన దొరగారు. పట్నం నుంచి వచ్చారు. సొంత వ్యవసాయంపెట్టి యింక మన వూళ్ళోనే వుంటారు." అని రాములు అనేసరికి రాములు భార్య అపరకాళి అవుతుందేమో అనుకున్నాడు వెంకట సుబ్బయ్య. ఆమె మౌనం వహించింది. ముఖంలోనూ యెటువంటిమార్పు కనిపించలేదు.

వెంకటసుబ్బయ్యకు ధైర్యంవచ్చింది. "రాములు లేకుండా నా మొహం నేనేం చేస్తాను సొంత వ్యవసాయం. రాములు

## నా సైకిలు

దీన్నేను తీసుకెడుతున్నానో
నన్నిది తీసుకెడుతుందో
నాకు తెలీదు
నా కవిత్వం లాగే.

ఆకాశానికీ రోడ్డుకీ మధ్య
చక్రాలు తిరుగుతాయి
అధిక భాగం ఆకాశంలోనే
అంగుళం మేర మాత్రం
అంటిపెట్టుకు నుంటుంది నేలని
నా కవిత్వం లాగే.

వీధుల్లో తేలే సాయంత్రపు మోహాలు
రంగుల గాలిపడగలు దిగిపోయి
మేం గూడు చేరుకున్నాక
ఒక చక్రం భూమ్మీద ఆన్చి
ఒక చక్రం కలల్లోకి తేల్చి
నిద్దరోతుంది
నా కవిత్వం లాగే.

—ఇస్మాయిల్

ఆసరా చూసుకునే దిగుతున్నా" అన్నాడు నవ్వుతూ.

"మీ మాటను యెన్నడైనా కాదన్నానుటండీ" తన అభిప్రాయాన్ని తెలియజేశాడు రాములు.

ఆ తర్వాత ఎవ్వరూ కొంతసేపు మాట్లాడలేదు.

అలుముకున్న ఆ మౌనాన్ని ఛేదిస్తూ రాములు భార్య ఇలా అన్నది.

"వ్యవసాయం పెట్టవచ్చుగానీండి.... ఈ వూరు అంత మంచిది కాదండి...."

"మంచిది కాదా.... అంటే దొంగతనాలూ అవీ ఎక్కువగా ఉన్నాయా యేమిటి రాములూ?"

"అబ్బే, అటువంటివేవీ లేవండి" అన్నాడు రాములు సగర్వంగా.

"అదికాదండి బాబుగారూ నేననడం. మీరూ చూసే వుంటారు.... ఈ వూళ్ళో వసతులు లేవండి మగవాళ్ళకేం చెప్పండి. మహరాజులు. పొద్దున్నే వెడతారు పొలానికి. ఎప్పుడో మధ్యాహ్నానికిగాని తిరిగిరారు.... వాళ్ళకేం తెలుస్తాయి చెప్పండి మా ఆడవాళ్ళ కష్టాలు."

"ఇదేవన్నా పట్నం అనుకున్నావా. యింట్లోనే నీళ్ళ పంపులూ అవీ వుండడానికి." అధికార స్వరంతో అన్నాడు రాములు.

"రాములూ నువ్వు కొంచెం ఆ విసుగూ, కోపం తగ్గించుకొని మాట్లాడు." వెంకటసుబ్బయ్య హితవు చెప్పాడు.

సమయం దొరికిందిగదా అనుకుని రాములు భార్య తన అక్కసును వెళ్ళగక్కింది. "ఆ రెండూ నేను బతికున్నంతవరకూ తగ్గవులెండి. అంతే ఆయన తీరు ...."

"అబ్బే . అదేం మాటమ్మా.. అవును గానీ మన వూళ్ళో చెరువుందిగద, మంచి నీళ్ళకి."

"ఉందిలెండి. చెరువు దగ్గర్నుంచి యింటికి నీళ్ళు చేరవేసేంత లోపల భుజం పడిపోతోందండి.... నెత్తీ నోరు బాదుకున్నా ఆయన ఈ సంగతి పట్టించుకుంటేనా బాబుగారూ ?"

,,మహా సెర్చావులే పట్నం మాటలు.. ఆ వెంకయ్యగారూ, వీరయ్యగారూ .... ఆ రెండిళ్ళలో తప్ప యింకెవరి దొడ్లో అయినా బావి వుందేమో చెప్పు. అంతా నీలాంటివాళ్ళే. చెరువుకి వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవడం లేదూ ? అసలు చెరువు కూడా లేని వూళ్ళు ఎన్నో వున్నాయి.... మన వూరు చాలా నయం....'

"బాబుగారూవిన్నారుగా .... యిదీ వరస. మీరు నాకు తండ్రి లాంటివాళ్ళు. నేను నా కష్టాలు చెప్పుకుంటే చాలు. ఆయనిలా ...." అంటూ తన మనస్సులో ఎన్నాళ్ళగానో మసలుతూన్న ఆ మాటను బయటపెట్టింది. ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. కంఠం రుద్ధమయింది.

ఆమె మీద వెంకటసుబ్బయ్యకు జాలి కలిగింది. పల్లెటూరంటే ఆమె ఎందుకు అసహ్యించుకుంటుందో తెలుసుకున్నాడు.

"రాములూ నీకు కోపం వస్తుందిగానీ. నిజానికి ఆడవాళ్ళు పడుతున్న యిబ్బందుల్ని మనం తెలుసుకుంటున్నామా చెప్పు. చెరువు దగ్గర్నుంచి నీళ్ళు చేరవెయ్యడం అందరికీ వీలవుతుందా ? ఆ రోజుల్లో అంటే. వాళ్ళు చాలా దృఢంగా వుండే వాళ్ళు. చెరువునుంచి నీళ్ళు తీసుకురావడం వాళ్ళకో లెక్కలోదికాదు. ఒకసారి మందు

---

## డిటో

నీ జడలో
నాలా
జంటలేక విలపించే
ఒంటి గులాబి.

—ఎస్. గుర్నాథ్

---


# SWARNA'S

3 Year Cash Certificates Assure **66.5%** on maturity

And there's provision for premature encashment too!

| Certificate Value | Issue Price | Premature encashment Value 1 Year | 2 Years | Value on Maturity |
|---|---|---|---|---|
| 1000 | 600 | 675 | 800 | 1000 |
| 2000 | 1200 | 1350 | 1600 | 2000 |
| 5000 | 3000 | 3375 | 4000 | 5000 |
| 10,000 | 6000 | 6750 | 8000 | 10,000 |

MASSCOM

**SWARNA** FINANCE AND INVESTMENT
H.O. 66 M.G. Road, BLUMOON COMPLEX Bangalore-560 001 Ph. 579620

హైదరాబాద్ – డక్కన్ టవర్స్ 201, మినార్ అపార్టుమెంట్స్, 5-9-59, బషీర్‌బాగ్-500001 ఫోన్: 38586
కాకినాడ – డోరు నెం.26-1-3, సత్యనారాయణమూర్తి దేవాలయంఎదుట, టెంపుల్‌స్ట్రీట్-533001 ఫోన్:5237
కర్నూలు – 40/30ఎ, పార్క్ రోడ్ ఫోన్: 1427
విజయవాడ – డోరు నెం. 26-28-2, నాగేశ్వరరావు పంతులురోడ్, గాంధీనగర్-520 003
ఇతర బ్రాంచీలు – కలకత్తా, కొచ్చిన్, మద్రాసు, మధురై, న్యూఢిల్లీ, పాండిచ్చేరి, కోయంబత్తూరు, త్రివేండ్రం.

వేసవిలో మన వూరి చెరువులో నీళ్ళు ఎండిపోతే, పొరుగూరినుంచి నీళ్ళ బిందెలు మోసుకువచ్చింది మా నాయనమ్మ. ఆ రోజుల్లో వాళ్ళు వద్దు దంచే వాళ్ళు. తీరిక వేళల్లో పొలం పనులు చేసే వాళ్ళు. రోజులు మారిపోవడంతో మునపటి ఆ దార్ఢ్యం, ఆ శక్తీ యిప్పటివాళ్ళల్లో యెక్కడున్నాయి? అదీగాక ఊరంతటికీ ఒక్కటే చెరువు. అందులోనే స్నానాలు అన్నీను. ఆ నీళ్ళే మనం తాగుతున్నాం. ఈ వాడలో ఒక్క బావివుంటే, ఎంత బావుంటుందో నువ్వే ఆలోచించు...."

రాములు భార్య ముఖమంతా కళ్ళుచేసుకుని "అలా చెప్పండి బాబుగారూ" అన్నది.

"ఒక్క రాముల్ని అని ఏం లాభం? ఊళ్ళో యింతమంది వున్నారు. ఒక్కళ్ళూ యిది పట్టించుకోరు."

"బావి మంచిదే అనుకోండి.... కాని సంసారం గడవడమే కష్టంగా వుంది." అసలు సంగతి బయటపెట్టాడు రాములు.

"అలా అని మనం పస్తులుంటున్నాముటండీ. మనం బతికినన్నాళ్ళూ కష్టాలూ మనతోపాటు వుండేవే. వాటితోపాటు ఒక్కబావి తవ్వించుకుంటే సరిపోతుంది" సలహా ఇచ్చింది రాములు భార్య.

వెంకటసుబ్బయ్య రాముల్ని అడిగాడు.

"పంచాయతీ బోర్డువాళ్ళు పన్నులేవో వసూలు చేస్తున్నారని విన్నా. ఆ డబ్బంతా ఏం చేస్తున్నట్టు?"

"అదంతా మావంటి బీదోళ్ళకేం తెలుస్తుంది చెప్పండి"

"బావులు తవ్వించకపోతే మానె, మంచి రోడ్డయినా వేయించకూడదూ? వానాకాలంలో ఈ మట్టి రోడ్డు మీదుగా చెరువు నుంచి నీళ్ళు తీసుకురావడం ఎంత యిబ్బందో చెప్పు."

"బాబుగారూ. యిప్పుడు మీరా సంగతి ఎత్తకండి. ఆయనకి ఎక్కడలేని చిరాకూ

## ప్రేమ మందిరం

ప్రేమ నిశ్శబ్దం అడుగులతో
కలలోలా వసుంది
ఆమె వెళ్ళిపోతూంటే తలుపుచప్పుడు
చేసింది
నేను పరుగెత్తా వెనక్కి పిలవాలని
కానీ కల చెదిరింది
చీకట్లో మాయమవుతూ
దూరంగా మిణుకుమిణుకు మంటున్న
కొవ్వొత్తి కాంతి
ఎర్రగా రక్తంలా భ్రాంతి కలిగిస్తోంది
నాకు చావాలని లేదు
ఈ అందమయిన ప్రపంచంలో
కానీ బ్రతకాలని వుంది
మనుష్యుల గుండెల్లో
వెలుగులు విరజిమ్మే పుష్పవనంలో
గూడు కట్టుకోవాలని వుంది
ఈ భూమి మీద
శాశ్వతమైన నా గృహం
కట్టుకోవాలని వుంది.

మూలం: రవీంద్ర గురుదేవులు
ఆంగ్లానువాదం: అరవిందుడు
తెలుగుసేత: తనికెళ్ళ శంకర్

వస్తుంది." తన కోపాన్ని తెలియజేసింది రాములు భార్య.

వెంకటసుబ్బయ్య ఏమీ మాట్లాడలేదు.

ఎపుడెపుడు ఈ విషయం దాటి మరొకటి ప్రస్తావనకు వస్తుందా అనుకున్నాడు రాములు. కనుక అతడూ మౌనం వహించాడు. ఎవరూ మాట్లాడకపోవడంతో, ఇన్నాళ్ళూ తాను మనస్సులోనే గుప్తంగా దాచుకున్న విషయాన్ని బయటపెట్టేందుకు తగిన అవకాశం దొరికిందనుకుని రాములు భార్య ఇలా అన్నది :

"బాబుగారూ. పట్నంలో వున్నారు కాబట్టి మీరు బతికిపోయారు. ఈ వూరి సంగతులు మీకు అట్టే తెలిసినట్టులేదు.... ఇది వట్టి బురద వూరండి. ఈ చుట్టుపక్కల యిటువంటి వూరెక్కడా లేదు. ఎక్కడలేని దరిద్రం ఈ వూరికే వచ్చి పడింది". ఆమె లోపలికి వెళ్ళింది.

(సశేషం)


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు, ____
విలాసము: ____
____ PIN ____




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ —

రూపానికి రూపం-గుణానికి గుణం!




ఫిలిప్స్
వేలియంట్ 4 బ్యాండ్లు
• పుర్ ఫాయిల్ ప్రింటెడ్ గ్రిల్
• స్లైడ్ కంట్రోల్స్
• క్రోమ్ పుష్ బటన్లు
• సులభంగా కరంటుకు మార్చుకోవచ్చు
రూ. 615
*సిఫారసు చేయబడిన వెల,
ఎక్సైజ్ డ్యూటీతో సహా. స్థానిక పన్నులు అదనం.
ఆడియోవిజన్, ప్రకాశం రోడ్. విజయవాడ-2. ఫోన్ : 76369. Ganesh